# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 16-08-2024** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

**1.** **ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్ ఖడ్ ఈ రోజు నుంచి రెండు రోజుల పాటు ఆంధ్రప్రదేశ్, తెలంగాణలలో పర్యటిస్తారు.**

**2.** **దేశంలోని ప్రజలంతా ఒకే సంకల్పంతో పనిచేస్తే 2047 నాటికి 'వికసిత్ భారత్' ఆవిర్భవిస్తుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు.**

**3.** **పేదవారికి నాణ్యమైన భోజనం అందించేందుకు అన్నా క్యాంటిన్లను ప్రారంభించామని ఆంధ్రపదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు.**

**4.** **ఆంధ్రప్రదేశ్ లోని విజయవాడ నుంచి ఢిల్లీకి కొత్తగా మరో విమాన సేవను అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు వెల్లడించారు.**

**5.** **తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన 8 నెలల్లోపే రైతులకు 2 లక్షల రుణమాఫీ చేశామని ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డి అన్నారు.**

**6.** **భారతరత్న మాజీ ప్రధాన మంత్రి అటల్ బీహారి వాజ్ పేయి వర్ధంతి ఈరోజు.**

==========================

ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్ ఖడ్ ఈరోజు నుంచి రెండు రోజుల పాటు ఆంధ్రప్రదేశ్, తెలంగాణలలో పర్యటిస్తారు. పర్యటనలో భాగంగా ఈరోజు ఉప రాష్ట్రపతి హైదరాబాద్‌లోని కన్హ శాంతి వనాన్ని సందర్శిస్తారు. రేపు ఆంధ్రప్రదేశ్‌లోని, నెల్లూరులో అక్షర విద్యాలయ క్యాంపస్, నైపుణ్యాభివృద్ధి కేంద్రం, స్వర్ణ భారత్ ట్రస్ట్, ముప్పవరపు ఫౌండేషన్లను సందర్శిస్తారు. అనంతరం ఆంధ్రప్రదేశ్లోని వెంకటాచలం స్వర్ణ భారత్ ట్రస్ట్ వార్షికోత్సవ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరవుతారు.

--------------------------

దేశంలోని 140 కోట్ల మంది ప్రజలు ఒకే సంకల్పంతో అన్ని అడ్డంకులను అధిగమించి 2047 నాటికి భారత్ 'వికసిత్ భారత్'గా ఆవిర్భవిస్తుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వ్యాఖ్యానించారు. నిన్న ఢిల్లీలో జరిగిన 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ప్రధానమంత్రి మాట్లాడుతూ.... భారత్‌ను శక్తివంతమైన దేశంగా తీర్చిదిద్దడంలో అంతరిక్షరంగం పాత్ర కీలకమైనదనిభారత్ దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించి, సాంకేతిక స్వయం సమృద్ధిని పెంపొందించే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని అన్నారు. బంగ్లాదేశ్ పరిస్థితిపై పొరుగు దేశంగా భారతదేశం

ఆందోళన చెందుతోందని, ఆ దేశంలో వీలైనంత త్వరగా సాధారణ పరిస్థితులు నెలకొంటాయని ప్రధానమంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు.

---------------------------

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా నిన్న సాయంత్రం విజయవాడలోని రాజ్‌భవన్‌లో 'ఎట్ హోం' కార్యక్రమం నిర్వహించారు. గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, ఆయన సతీమణి సమీరా నజీర్ తేనీటి విందు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి కె.పవన్ కల్యాణ్, ఆంధ్రప్రదేశ్ ఉన్నత న్యాయస్థానం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకుర్ దంపతులు, హైకోర్టు న్యాయమూర్తులు, పలువురు రాష్ట్ర మంత్రులు, పార్లమెంటు సభ్యులు, శాసన సభ్యులు, సీనియర్ అధికారులు, 'పద్మ' పురస్కార గ్రహీతలు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు పాల్గొన్నారు. వీరితోపాటు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరభ్‌కుమార్ ప్రసాద్, డీజీపీ ద్వారకాతిరుమలరావు, గవర్నర్ కార్యదర్శి హరిజవహర్‌లాల్ హాజరయ్యారు.

---------------------------

స్మాల్ శాటిలైట్ లాంచ్ వెహికల్ –ఎస్‌ఎస్‌ఎల్‌వి రాకెట్ ద్వారా ఎర్త్ అబ్జర్వింగ్ ఉపగ్రహం –ఈఓఎస్–08ని ప్రయోగించనున్నట్లు భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ –ఇస్రో తెలిపింది. ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతి జిల్లాలోని శ్రీహరికోట సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం నుంచి ఈ రోజు ఉదయం 9 గంటల 17 నిమిషాలకు ఈ ఉపగ్రహాన్ని నింగిలోకి పంపనున్నట్లు శాస్త్రవేత్తలు తెలిపారు. సూక్ష్మ ఉపగ్రహాన్ని రూపొందించడం, అభివృద్ధి చేయడం, మైక్రోసాటిలైట్ బస్‌కు అనుకూలమైన పేలోడ్ పరికరాలను రూపొందించడం, భవిష్యత్ కార్యాచరణ ఉపగ్రహాలకు అవసరమైన కొత్త సాంకేతికతలను చేర్చడం ఈ మిషన్ ప్రాథమిక లక్ష్యాలని ఇస్రో వెల్లడించింది.

---------------------------

పేదవారికి నాణ్యమైన భోజనం అందించేందుకు అన్నా క్యాంటిన్లను ప్రారంభించామని ఆంధ్రపదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. నిన్న కృష్ణాజిల్లా గుడివాడలో ముఖ్యమంత్రి తొలి అన్నా క్యాంటిన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఎన్నికల హామీల్లో భాగంగా ఇచ్చిన మాట ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా తొలిదశలో 100 అన్న క్యాంటిన్లను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. అన్నా క్యాంటీన్లలో 5 రూపాయల చొప్పున మూడు పూటలా అల్పాహారం, భోజనం అందిస్తామని ముఖ్యమంత్రి పేర్కొంటూ...

వాయిస్ (25 సెకన్లు )

ఇలా ఉండగా.. ఆంధ్రపదేశ్ వ్యాప్తంగా మరో 99 అన్నా క్యాంటిన్లు ఈ రోజు ప్రారంభం కానున్నాయి. ఆయా జిల్లాలలో రాష్ట్ర మంత్రులు, శాసనసభ్యులు క్యాంటిన్లను ప్రారంభిస్తారు.

---------------------------

ఈరోజు వరలక్ష్మీ వ్రతాన్ని ప్రజలు భక్తి శ్రద్ధలతో జరుపుకుంటున్నారు. సౌభాగ్యం, కుటుంబ శ్రేయస్సు కోసం వివాహిత స్త్రీలు శ్రావణ మాసంలో వరలక్ష్మీ వ్రతం ఆచరిస్తారు. శ్రావణ మాసం శుక్ల పక్షంలో పౌర్ణమికి ముందు వచ్చే శుక్రవారాన్ని మహిళలు వరలక్ష్మీ వ్రతంగా జరుపుకోవడం సంప్రదాయంగా వస్తోంది. వరాలు ఇచ్చే దేవతగా వరలక్ష్మీ దేవిని కొలుస్తారని... ఈ రోజున అమ్మవారిని పూజిస్తే అష్ట ఐశ్వర్యాలు కలుగుతాయని పురాణాలు పేర్కొంటున్నాయి. వరలక్ష్మీ వ్రతం సందర్భంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాల్లోని అన్ని ప్రధాన ఆలయాలు... ప్రత్యేకించి వైష్ణవాలయాల్లో ప్రజలు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లో కూడా వరలక్ష్మీ వ్రతాన్ని ప్రజలు భక్తి శ్రద్ధలతో జరుపుకుంటున్నారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ నుంచి దేశరాజధాని ఢిల్లీకి కొత్తగా మరో విమాన సేవను అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు వెల్లడించారు. ఈ సేవలు వచ్చే నెల 14 నుంచి ప్రారంభం కానున్నాయని, ఉదయం సమయంలో విజయవాడ నుంచి ఢిల్లీకి విమాన సర్వీసు అందుబాటులోకి తేవాలని ప్రజల నుంచి అందిన విజ్ఞప్తుల మేరకు కొత్త సర్వీసు నడిపేందుకు ఇండిగో సంస్థ అంగీకరించిందని కేంద్ర మంత్రి సామాజిక మాధ్యమం ద్వారా తెలిపారు. విజయవాడలో ఉదయం 11 గంటల 10 నిమిషాలకు విమానం బయలుదేరి.. మధ్యాహ్నం ఒంటి గంటా 40 నిమిషాలకు ఢిల్లీకి చేరుతుందని తెలిపారు. అలాగే ఢిల్లీ నుంచి ఉదయం 8 గంటల 10 నిమిషాలకు బయలుదేరి.. విజయవాడకు 10 గంటల 10 నిమిషాలకు చేరుకుంటుందన్నారు. కొత్తగా అందుబాటులోకి వచ్చే విమాన సర్వీసు వల్ల రాజధాని అమరావతి, ఢిల్లీ మధ్య రాకపోకలు సులభతరం అవుతాయని పేర్కొన్నారు.

---------------------------

కేంద్ర ప్రభుత్వం దేశంలోని మారుమూల ప్రాంతాలకు కూడా అభివృద్ధి ఫలాలు చేరాలనే లక్ష్యంతో ఆకాంక్షాత్మక జిల్లాలు, విభాగాల కార్యక్రమాన్ని చేపట్టింది. ఇందులో భాగంగా దేశవ్యాప్తంగా వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి కొరకు నీతి ఆయోగ్ 3 నెలల పాటు 'సంపూర్ణతా అభియాన్' ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించింది. సెప్టెంబర్ 30 వరకు ఈ ప్రచారం కొనసాగనుంది. దేశ వ్యాప్తంగా ఆకాంక్ష జిల్లాల్లో 6 సూచికలు, ఆకాంక్ష బ్లాకుల్లో 6 కీలక సూచికల సంతృప్తతను సాధించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ఆకాంక్షాత్మక జిల్లాలు, విభాగాల సంపూర్ణతా అభియాన్ పై ఆకాశవాణి విజయవాడ ప్రాంతీయ వార్తా విభాగం రూపొందించిన ప్రత్యేక చర్చా కార్యక్రమం ఈ రోజు ఉదయం 10 గంటలకు ప్రసారమవుతుంది.

---------------------------

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన 8 నెలల్లోపే రైతులకు 2 లక్షల రుణమాఫీ చేశామని ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డి అన్నారు. సాగుకు జీవం.. రైతుకు ఊతం పేరుతో ఖమ్మం జిల్లా వైరాలో నిన్న ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. తమ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు 31వేల కోట్లతో రుణమాఫీ చేశామని తెలిపారు ఖమ్మం జిల్లా రైతాంగానికి ఉపయోగపడే సీతారామ ప్రాజెక్టు 2026 లోపు పూర్తి చేసి జిల్లాలోని 7 లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తామన్నారు. నియోజకవర్గానికి 3 వేల 500 చొప్పున తెలంగాణ వ్యాప్తంగా 4.5లక్షల ఇందిరమ్మ గృహాలను నిర్మిస్తామని చెప్పారు. ఆరు గ్యారంటీల అమలుకు ప్రభుత్వం కట్టబడి ఉందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

---------------------------

భారతరత్న మాజీ ప్రధాన మంత్రి అటల్ బీహారి వాజ్ పేయి వర్ధంతి ఈరోజు, ఆయన 1925 డిసెంబరు 25వ తేదిన మధ్యప్రదేశ్లోని గ్వాలియర్లో జన్మించారు. భారత ప్రధాన మంత్రిగా దేశానికి సేవలు అందించారు. 1996లో ప్రధాన మంత్రిగా అణుపరీక్షలను ప్రోత్సహించి ప్రపంచంలోనే భారత్ కు ఒక శక్తివంతమైన దేశంగా గుర్తింపు తీసుకువచ్చారు. వాజ్ పేయి ప్రధాన మంత్రిగా ఉన్న తరుణంలోనే కార్గిల్ ప్రాంతంలో పాకిస్తాన్ చేసిన దాడిని భారత్ తిప్పికొట్టి ఆ దేశానికి ఒక గుణపాఠం చెప్పింది. దేశ ప్రగతి కోసం ఆయన చేపట్టిన స్వర్ణ చతుర్భుజి జాతీయ రహదారుల విస్తరణ, ప్రధాన మంత్రి గ్రామీణ సడక్ యోజన వంటి పథకాలు విశేష ప్రజాదరణ పొందాయి. దేశానికి అందించిన సేవలకు గుర్తింపుగా ఆయనను భారతరత్న పురస్కారంతో కేంద్ర ప్రభుత్వం 2015లో సత్కరించడంతో పాటు ప్రతిఏటా ఆయన జన్మదినం రోజైన డిసెంబరు 25వ తేదిన జాతీయ సుపరిపాలన దినోత్సవంగా నిర్వహిస్తోంది.

=====================